సాక్షి జగిత్యాల
7
గురువారం । 17 । ఆగస్టు । 2023

సల్లంగ సూడు తల్లీ..

మల్లాపూర్ : తమను సల్లంగ సూడాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ కుస్తాపూర్‌వాసులు గోదావరి జలాలతో గ్రామ దేవతలకు బుధవారం జలాభిషేకం చేశారు. మొక్కులు చెల్లించారు.



న్యూస్‌రీల్

18న పాపన్న గౌడ్ జయంతి

జగిత్యాల: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని ఈనెల 18న కలెక్టరేట్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల ప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ సూచించారు.

బాధ్యత పెరిగింది



ఉత్తర్వులు అందిస్తున్న వసంత

జగిత్యాలజోన్: ప్రభుత్వ ఉద్యోగంలో చేరడం ద్వారా వీఆర్‌ఏల బాధ్యత మరింత పెరిగిందని జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత అన్నారు. పంచాయతీరాజ్ శాఖకు కేటాయించిన 47 మంది వీఆర్‌ఎలకు జెడ్పీ క్యాంపు కార్యాలయంలో బుధవారం నియామక ఉత్తర్వులను ఆమె అందజేశారు. అనంతరం మాట్లాడారు. దశాబ్దాలుగా వెట్టిచాకిరీ చేస్తున్న వీఆర్‌ఎలకు రాష్ట్ర ప్రభుత్వం విముక్తి ప్రసాదించిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు వీఆర్‌ఎలను చులకనగా చూశారని, సీఎం కేసీఆర్ ఇప్పుడు వారి ఆత్మగౌరవం కాపాడేలా ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రామానుజాచారి, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యత పాటించాలి



మాట్లాడుతున్న డీఈవో జగన్మోహన్‌రెడ్డి

జగిత్యాల: పాఠశాలల మరమ్మతుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి సూచించారు. స్థానిక ఓల్డ్ హైస్కూల్‌లో రూ.1.64 కోట్ల వ్యయంతో చేపట్టిన మన బస్తీ.. మన బడి పనులను ఆయన బుధవారం తనిఖీ చేశారు. పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు చదువు చెబుతున్నారా? పాఠశాల ఎలా ఉంది? అని అడిగి తెలుసుకున్నారు. గాంధీ సినిమాను ప్రతీఒక్కరు తిలకించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రామానుజం పాల్గొన్నారు.

'ఫోన్' బాధితులపై ఏసీబీ అధికారుల ఆరా

సాక్షి ఎఫెక్ట్..

జగిత్యాల: 'హలో.. నేను ఏసీబీ అధికారిని మాట్లాడుతున్నా' శీర్షికన ఈనెల 12న 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న పలువురు అధికారులకు అజ్ఞాత వ్యక్తులు చేసిన ఫోన్లపై వరంగల్ రేంజ్ ఏసీబీ అధికారులు విచారణ ప్రారంభించారు. జిల్లాలో ఎవరెవరికి ఇలాంటి ఫోన్లు వెళ్లాయి, అగంతకులు ఎలాంటి వివరాలు అడిగారు, బాధితులు ఎలాంటి జవాబులు ఇచ్చారనే అంశాలపై ఆరా తీస్తున్నారు. ఫోన్ చేసింది ఎవరు, ఎందుకు చేశారు? ఏ ఫోన్‌నంబర్ల నుంచి ఫోన్ చేశారు? అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. పలు మండలాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న కిందిస్థాయి అధికారులకు ఫోన్లు రావడంతో భయాందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఈక్రమంలోనే ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు.

ఆరోగ్య సేవలపై క్షేత్రస్థాయి ఆడిట్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీధర్

గొల్లపల్లి(పెగడపల్లి): అసంక్రమిక వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా పెగడపల్లి మండలం ఆరెపల్లి గ్రామంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి శ్రీధర్ బుధవారం ఆరోగ్య సేవలపై క్షేత్రస్థాయి ఆడిట్ చేశారు. మందులు భద్రపర్చడానికి, వ్యాధిగ్రస్తులకు అందించిన కిట్ బ్యాగులను పేషెంట్లకు పంపిణీ చేయడంపైనా ఆయన ఆరా తీశారు. సంక్షేమ పథకాల అమలు తీరు గురించి నేరుగా లబ్ధిదారులను కలుసుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. హెల్త్‌వెల్‌నెస్ సెంటర్‌లో వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న సూచనలు, ఆహారపు అలవాట్లు, వ్యాయామాల గురించి తెలుసుకున్నారు. గ్రామంలో 31మంది బీపీ, 21మంది షుగర్ బాధితులు మందులు వాడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

తుపాకుల కలకలం

- అనుమతిలేని ఆయుధాల వినియోగం
- జిల్లాలో ఏడు నెలల్లో రెండు సంఘటనలు
- తనిఖీలు విస్తృతం చేసిన పోలీసులు

- ఈ ఏడాది మే 31న కోరుట్ల మండలం అయిలాపూర్ శివారు రైల్వేట్రాక్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు అదే గ్రామానికి చెందిన నందరగిరి లక్ష్మీనర్సయ్య అనుమానాస్పదంగా కనిపించాడు. పోలీసులు తనిఖీ చేయగా పిస్టల్(ఆటోపిస్టల్ మేడ్ ఇన్ యూఎస్ఏ)తోపాటు, రెండు మ్యాగ్జిన్‌లు, మూడు కేఎఫ్ 7.65 ఎంఎం బుల్లెట్లు లభించాయి.
- 2020 ఫిబ్రవరి 3న గొల్లపల్లి మండలం ఇస్రాజ్‌పల్లిలో ఉంటున్న తన భార్యపై మేడిపల్లి మండలం గోవిందారం గ్రామానికి చెందిన ప్యాట శ్రీనివాస్ తుపాకీతో కాల్పులు జరిపాడు. గురి తప్పడంతో భార్య మేనమామ బైరం రాజిరెడ్డికి తూటాలు తగిలి గాయపడ్డాడు.
- రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు చెందిన తిరుపతికి ముంబయికి చెందిన రాజుభయ్య 2018 అక్టోబరు 18న కోరుట్లలో ఆయుధాలు విక్రయిస్తుండగా సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. నిందితుడి నుంచి రెండు తుపాకులు, 12 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు.
- ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగి ఒకరు ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్ మాజీ సర్పంచ్ సుంకె రాజన్నపై 2017 అక్టోబరు 21న 7.65ఎంఎం తుపాకీతో కాల్పులు జరిపారు.
- కల్లు దుకాణాల యజమానులను వేధిస్తున్నాడనే కారణంతో ధర్మపురిలోని ఓ వైన్స్ వద్ద పోచెటి సత్యనారాయణగౌడ్‌ను ముంబయికి చెందిన రాజుభాయ్ 2018 మే 9న తుపాకీతో కాల్చి చంపాడు.



- రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గూడెం మహేందర్‌రెడ్డి ఓ భూ వివాదం సెటిల్ చేసేందుకు ఈనెల 15న జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాజారం గ్రామానికి వచ్చాడు. వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు అనూహ్యంగా చిక్కాడు. నిందితుడి నుంచి పిస్టల్‌తోపాటు, ఆరు బులెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఆరేళ్లలో ఆరు సంఘటనలు..

- జిల్లాలో 2017 నుంచి ఇప్పటివరకు ఆరు తుపాకుల సంఘటనలు చోటుచేసుకున్నాయి.
- నక్సల్స్ ప్రాబల్యం పూర్తిగా తగ్గిన తర్వాత ఆయుధాలు వెలుగుచూస్తుండటం విస్మయానికి గురిచేస్తోంది.
- చాలామంది బడా వ్యాపారులు, రియల్టర్లు, రౌడీషీటర్లు పోలీసుల కళ్లుగప్పి అనుమతి లేకుండా మారణాయుధాలు వినియోగిస్తున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న పిస్టల్, మ్యాగ్జిన్‌లు, బుల్లెట్లు(ఫైల్)

జిల్లాలో లైసెన్స్‌డ్ తుపాకులు	
బ్యాంకు సెక్యూరిటీ	9
ప్రజాప్రతినిధులు, వ్యాపారులు	23
మొత్తం	32

జగిత్యాలక్రైం: జిల్లాలో లైసెన్స్‌లేని తుపాకులు పోలీసులకు పట్టుబడటం కలకలం రేపుతోంది. జగిత్యాల జిల్లా ఆవిర్భావానికి ముందు నుంచే ఇక్కడ రియల్ ఎస్టేట్ రంగం, వ్యాపార, వాణిజ్యం లావాదేవీలు జోరుగా సాగుతూ వస్తున్నాయి. వీటితోపాటే సెటిల్‌మెంట్లు, వ్యాపార లావాదేవీల్లో విభేదాలు, భూ దందాలు, వ్యక్తిగత కక్షలూ మితిమీరుతున్నాయి. వీటిలో జోక్యం చేసుకుని లబ్ధిపొందడం, వ్యక్తిగత ప్రతిష్టలు పెంపొందించుకోవడం, రాజకీయంగా నిలదొక్కుకోవడం, తమ ప్రత్యేకత చాటుకోవడం, పంతం నెగ్గించుకోవడం కోసం కొందరు ఆయుధాలను వినియోగిస్తున్నారు. వీటికి లైసెన్స్ లేకపోవడం పోలీసులను విస్మయానికి గురిచేస్తోంది. ఈనెల 15న మల్యాల మండలం రాజారం వద్ద రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌కు చెందిన గూడెం మహేందర్‌రెడ్డి.. పిస్టల్, బుల్లెట్లతో పోలీసులకు చిక్కడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

బిహార్ గ్యాంగ్‌తో పరిచయాలు..

జిల్లాకు చెందిన కొందరు రియల్టర్లు, నేరస్తులు, అక్రమ వ్యాపారులు బిహార్ గ్యాంగ్‌లతో పరిచయాలు పెంచుకుంటున్నారని సమాచారం. ఆ రాష్ట్రానికి చెందిన కూలీలు పొట్టచేత పట్టుకుని ఉపాధి కోసం జిల్లాకు వస్తున్నారు. వివిధ రంగాల్లో పనులు చేస్తూ పొట్టపోసుకుంటున్నారు. ఇందులో కొందరిని మచ్చిక చేసుకుంటున్న అక్రమార్కులు.. బిహార్‌లో ఆయుధాలు లభించే ప్రాంతాలు, వాటిని విక్రయించే వ్యక్తుల సమాచారం తెలుసుకుంటున్నారు. వారిచ్చిన సమాచారం ఆధారంగా ఆ రాష్ట్రానికి వెళ్లి తుపాకులు, ఇతర ఆయుధాలు కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ క్రమంలోనే జిల్లావ్యాప్తంగా తనిఖీలు విస్తృతం చేస్తున్నారు. అక్రమ ఆయుధాల కట్టడికి కఠిన చర్యలు తీసుకుంటున్నారు.

> **మారణాయుధాలు ఉంటే చర్యలు**
>
> అనుమతిలేని మారణాయుధాలను ఎవరూ కలిగి ఉండరాదు. వాటి ఆధారంగా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, అసాంఘిక చర్యలకు దిగినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. అనుమానితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలి. పోలీసు శాఖ ప్రజల భద్రత కోసం నిరంతరం పనిచేస్తుంది.
>
> – ఎగ్గడి భాస్కర్, ఎస్పీ

పాటకు ప్రాణం.. తల్లడిల్లే తల్లి మనసే..



జగిత్యాలక్రైం: 'చాలామంది పిల్లలు తల్లిదండ్రుల మాట వినడం లేదు.. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదు.. మరీ ముఖ్యంగా యువకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.. ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాల బారినపడుతున్నారు.. అమూల్యమైన ప్రాణాలు కోల్పోతున్నారు.. అమ్మానాన్నలకు పుత్రశోకం మిగుల్చుతున్నారు.. బంగారు భవిష్యత్ ఉన్న బిడ్డ ప్రాణాలు కోల్పోతే ఆ తల్లి పడే బాధ అంతాఇంతా కాదు.. ఆ వేదననే 'చందమామ కంటే చక్కని రూపము.. నిన్నెట్ల మరిసుందురా బిడ్డా' అంటూ పాట రూపంలో ప్రజల ముందుకు తీసుకొచ్చా' అంటున్నారు ఎస్పీ భాస్కర్. 'సాక్షి'తో ఆయన పంచుకున్న అనుభవాలు ఆయన మాటల్లోనే..



ట్రాఫిక్ నిబంధనలపై రూపొందించిన పాట లోగో

- పిల్లలూ.. అమ్మానాన్న మాట వినాలి
- ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
- రోడ్డు ప్రమాదాల బారిన పడొద్దు
- పుత్రశోకం మిగిల్చవద్దు..
- 'సాక్షి'తో ఎస్పీ భాస్కర్

- ఈ ఏడాది జూలై 4న సురక్ష దినోత్సవం నిర్వహిస్తున్నాం. హెల్మెట్ లేకుండా ఓ యువకుడు బైక్ అతివేగంగా నడుపుతున్నాడు. మరో యువకుడు దానిపై కూర్చున్నాడు. జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ ప్రాంతంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. తలకు తీవ్రగాయాలై ఇద్దరూ చనిపోయారు. ఓ వారం రోజుల తర్వాత.. జగిత్యాల బైపాస్‌రోడ్డుకు చెందిన ఓ బాలుడి తండ్రి గల్ఫ్ నుంచి వచ్చాడు. అదేరోజే మంచినీళ్ల కోసమని ఆ బాలుడు ద్విచక్ర వాహనంపై వాటర్ ప్లాంట్‌కు బయలు దేరి వెళ్లాడు. అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొని మృతిచెందాడు. ఇంట్లోంచి బయటకు వెళ్లిన కొన్ని క్షణాల్లోనే కొడుకు విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు కావడం బాధించింది.
- నేను చదువుకున్న రోజుల్లోనే చిన్నచిన్న కవితలు రాశా. పాఠశాల, కళాశాల స్థాయిలో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నా. అందుకే ప్రమాదాల నియంత్రణకు ఓ పాట రాయాలని సంకల్పించా. మంచి పాట రాశా.
- వీలైనంత వరకు అతిత్వరగా రోడ్డు ప్రమాద ప్రాంతాలకు చేరుకోవాలని అధికారులకు సూచిస్తున్నా. బాధితుల ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించాలని చెబుతున్నా.. ముఖ్యంగా తక్షణమే స్పందించాలని ఘటనా స్థలాల్లో ఉండే ప్రజలకు అవగాహన కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నా. సీపీఆర్‌పై వివరిస్తున్నా. ప్రజల్లో చైతన్యం తెస్తున్నా.
- హైదరాబాద్‌లో కొంతకాలం ట్రాఫిక్ అడిషనల్ డీసీపీగా సేవలు అందించా. రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం అక్కడ షార్ట్‌ఫిల్మ్‌లు నిర్మించా. వాటిని ప్రదర్శిస్తూ ట్రాఫిక్ నిబంధనలు, జాగ్రత్తలు తీసుకునేలా యువతలో చైతన్యం తీసుకొచ్చా. జగిత్యాల జిల్లాలోనూ ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం ఇంజినీరింగ్, ట్రాన్స్‌పోర్ట్ శాఖల అధికారులతో కలిసి హాట్‌స్పాట్లు గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం.
- కొందరు యువకులు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నారు. పోలీసుల తనిఖీల్లో పట్టుబడుతున్నారు. ఇలాంటి వారికి ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో షార్ట్‌ఫిల్మ్ ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. వారి కుటుంబసభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాం. యువతే కాదు.. ఎవరైనా ట్రాఫిక్ నిబంనలు పాటించాలి. సురక్షితంగా గమ్యస్థానం చేరాలి. అదే మా లక్ష్యం.



ట్విట్టర్‌లో డీజీపీ అభినందన

గోదావరి తీరాన.. లింగాల 'రేవ్' పార్టీ

- పంద్రాగస్టు.. దావత్ జోరు
- మందు తాగి, మాంసాహారం తిని..
- సంబురాల్లో మునిగి తేలిన వైద్య, ఆరోగ్య సిబ్బంది
- డీజే సౌండ్ మధ్య మహిళా సిబ్బంది నృత్యాలు
- హాజరైన ఓ ప్రముఖ అధికారి
- విమర్శలకు దారితీసిన 'కంటివెలుగు' ప్రశంస పత్రాల పంపిణీ



కోరుట్ల: స్వాతంత్య్ర దినోత్సవ వేళ.. వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది గోదావరి నదీ తీరాన డీజే సౌండ్ మధ్య సంబురాలు చేసుకోవడం విస్మయం కలిగించింది. అక్కడితో ఆగకుండా.. చిత్తుగా మందు తాగి.. మాంసాహారంతో ధావత్ చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఇదే పార్టీ సందర్భంగా అక్కడే ఓ వేదికపై ఉన్నతాధికారి ఒకరు.. కంటివెలుగు కార్యక్రమంలో చక్కగా పనిచేసిన సిబ్బందికి ప్రశంస పత్రాలు బహూకరించినట్లు తెలిసింది. విశ్వసనీయంగా తెలిసిన వివరాలు.. జిల్లాలోని మల్లాపూర్ మండలం వేంపల్లి–వెంకట్రావ్‌పేట సమీప గోదావరి తీరంలోని లింగాలరేవు సమీపంలో మంగళవారం సుమారు 35 మంది వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది సంబురాలు చేసుకున్నట్లు సమాచారం. మహిళా సిబ్బంది డీజే సౌండ్ మధ్య నృత్యాలు చేశారని తెలిసింది. 'సండెట్లో సడేమియా'లా కొందరు మందు, మటన్‌తో ధావత్ చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఇందులో ఓ ఉన్నతాధికారి సైతం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. పైనుంచి కిందిస్థాయి వరకు సిబ్బంది వేడుకల్లో పాల్గొన్నట్లు సమాచారం. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా వైద్య, ఆరోగ్య సిబ్బంది మాంసాహారం భుజించడం, మద్యం తాగడం విమర్శలకు దారితీసింది. మొత్తమ్మీద ఈ తంతు 'లింగాల రేవు'గా హల్‌చల్ అయింది.

నకిలీ ఏజెంట్లను ఆశ్రయించొద్దు



మెట్‌పల్లిలోని ట్రావెల్స్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

- ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం/రాయికల్/కథలాపూర్/మెట్‌పల్లి/కోరుట్ల: విదేశాల్లో ఉద్యోగాల కోసం నకిలీ ఏజెంట్లను ఆశ్రయించి మోసపోవద్దని ఎస్పీ భాస్కర్ సూచించారు. జిల్లాలోని 15 ట్రావెల్స్, 36 ఏజెన్సీలపై బుధవారం ఏకకాలంలో తనిఖీలు చేశామన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ట్రావెల్స్, ఏజెన్సీల్లోని 101 పాస్‌పోర్టులను సీజ్ చేశామని, 300 డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. విదేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తామని నిరుద్యోగుల నుంచి అధికమొత్తంలో డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడే ఏజెన్సీలు, ట్రావెల్స్ యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిరుద్యోగులు పోలీసుల సూచనలు పాటించాలని చెప్పారు. విదేశాలకు వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

వైన్స్‌లకు 920 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

జగిత్యాలక్రైం: జగిత్యాల, ధర్మపురి, మెట్‌పల్లి ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలోని మద్యం దుకాణాలకు బుధవారం వరకు 920 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు. జగిత్యాలలోని 32 షాపులకు 433, ధర్మపురిలోని 14 షాపులకు 266, మెట్‌పల్లి సర్కిల్‌లోని 25 షాపులకు 221 దరఖాస్తులు అందాయన్నారు. దరఖాస్తుదారులు మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్, పాన్‌కార్డు, కుల ధ్రువీకరణపత్రం, దరఖాస్తు రుసుం రూ.2లక్షల డీడీతో జగిత్యాల ధరూర్ క్యాంప్‌లోని జగిత్యాల ఎక్సైజ్ కార్యాలయంలోని కౌంటర్లలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఈనెల 18 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈనెల 21న ఉదయం 10 గంటలకు జగిత్యాల వీరూపాక్షి గార్డెన్స్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో డ్రా పద్ధతిన మద్యం దుకాణాలు కేటాయిస్తామని ఆయన వివరించారు.

మహిళల రక్షణే లక్ష్యం



సదస్సుకు హాజరైన విద్యార్థినులు

జగిత్యాలరూరల్: మహిళల రక్షణ కోసం షీ టీం నిరంతర కృషి చేస్తోందని ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ఉర్దూమీడియం పాఠశాలలో యాంటి ఉమెన్ ట్రాకింగ్ యూనిట్ అధికారులు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, మానవ అక్రమ రవాణా నిర్మూలనపై బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ, బాల్య వివాహాలు నేరమన్నారు. బాధితులు నిర్భయంగా షీటీం నంబరు 87126 70783నంబరుకు ఫోన్‌చేసి సమాచారం అందించాలని కోరారు. ఏఎస్సై అలీబేగ్, కానిస్టేబుళ్లు సౌజన్య, మంజూ పాల్గొన్నారు.

19న 5కే రన్

- కలెక్టర్ యాస్మిన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

జగిత్యాల: అర్హులందరికీ ఓటుహక్కు కల్పించాలనే లక్ష్యంతో అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈనెల 19వ తేదీన 5కే రన్ నిర్వహించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఎన్నికల సంయుక్త ప్రధాన అధికారి సర్ఫరాజ్ అహ్మద్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో మాట్లాడారు. ఈనేపథ్యంలో కలెక్టర్ యాస్మిన్ బాషా తన కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఓటింగ్ శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇదే సమయంలో అర్హులైన ప్రతీఒక్కరికి ఓటుహక్కు కల్పించాలని అన్నారు. ప్రతీనియోజకవర్గ పరిధిలో స్వీప్ కార్యాచరణపై పక్కా ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. వందశాతం పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగుల సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లత, ఆర్డీవోలు రాజేశ్వర్, మధు, నోడల్ అధికారి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి

ఓటరు జాబితాలో పేరు నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. 'సిస్టమేటిక్ ఓటరు ఎడ్యుకేషన్.. ఎలక్టోరల్ పార్టిసిపేషన్' అంశంపై అధికారులతో సమావేశమయ్యారు. ఉన్నత విద్యా సంస్థల్లో ప్రత్యేక ఎలక్టోరల్ క్లబ్బులు ఏర్పాటు చేయాలన్నారు. ఓటు హక్కు ప్రాముఖ్యతపై విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు. కొత్త ఓటర్లకు గుర్తింపుకార్డులు ముద్రించి అందించాలని సూచించారు. అధికారులు ఉన్నారు.

భద్రత లేదు.. వసతులు కరువు



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

- ఆదర్శ కళాశాల హాస్టల్ విద్యార్థినుల ఆవేదన
- జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన

మల్లాపూర్(కోరుట్ల): హాస్టల్‌లో మౌలిక వసతులు సమకూర్చాలని, పూర్తిస్థాయిలో భద్రత కల్పించాలనే డిమాండ్‌తో స్థానిక మోడల్ కళాశాల విద్యార్థినులు బుధవారం ఆందోళనకు దిగారు. తమ సమస్యలు పరిష్కరించాలని ప్రిన్సిపాల్, వార్డెన్‌తోపాటు కలెక్టర్.. ఇలా కనిపించిన వాళ్లకు ఏళ్లుగా విన్నవిస్తున్నా ప్రయోజనం లేదని ఆవేదన చెందారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని స్థానిక జాతీయ రహదారిపై ధర్నా చేశారు. గంటలకొద్దీ రోడ్డుపై బైఠాయించారు. నాణ్యమైన ఉన్నత విద్య అందించాలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యాన్ని అధికారులు నీరుగార్చుతున్నారని ఆరోపించారు. గదులకు తలుపులు, కిటికీలు లేవని, ఫ్యాన్లు, విద్యుత్ బల్బులు అంతంత మాత్రమే ఉన్నాయని తెలిపారు. రాత్రి వేళల్లో దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, నిద్ర కూడా పోవడం లేదని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ఈ సమయంలో వార్డెన్, కేర్‌టేకర్, ఏఎన్‌ఎంలు అందుబాటులో లేరని దుయ్యబట్టారు. జ్వరాలతో బాధపడే వారికి ప్రథమ చికిత్స కూడా అందడం లేదని పేర్కొన్నారు. కేర్‌టేకర్ లేక రాత్రి వేళ హాస్టల్‌లో ఉండాలంటే భయం వేస్తోందని చెప్పారు. సమాచారం అందుకున్న ఎస్సై నవీన్‌కుమార్, ప్రిన్సిపాల్ అలీమొద్దీన్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వాహిని వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. సమస్య గురించి విద్యార్థినులతో మాట్లాడారు. ఈవిషయాన్ని ఉన్నాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థినులు ఆందోళన విరమించారు.

క్లుప్తంగా

సాగునీరు వెంటనే విడుదల చేయాలి



మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్: ఎస్సారెస్పీ డీ–83బీ కెనాల్ నుంచి పంటలకు సాగు నీరు వెంటనే విడుదల చేయాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఎండపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మారం, వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లోని 12 గ్రామాల్లో సుమారు 10 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించే డీ–83బీ కెనాల్ రెండు నెలల క్రితం కురిసిన అకాల వర్షాలకు కొట్టుకుపోయిందన్నారు. ఇప్పటివరకు పునరుద్ధరించక పోవడంతో వేల ఎకరాల్లో పత్తి పంట ఎండిపోతోందని, నీరు లేక వరినాట్లు వేయకుండా రైతులు భూములను బీడుగా వదిలేశారని తెలిపారు. నాటు వేసిన వారు పంట ఎండిపోతుందని ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. వెంటనే కాల్వకు మరమ్మతు చేపట్టి, పంటలకు నీరందిచాలని కోరారు. ఈ సమస్యపై గురువారం ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తామన్నారు. రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వెల్గటూర్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూదరి రమేశ్, నాయకులు చంద్రమౌళి, లక్ష్మణ్, రమేశ్, శ్రీనివాస్, మహేశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

జీరో దందా.. జీఎస్టీ ఎగవేతకేనా?

- కిరాణా వస్తువులు నేరుగా దుకాణాల ప్రదేశాలకు తరలింపు
- చోద్యం చూస్తున్న అధికారులు
- జగిత్యాలలో పరిస్థితి

జగిత్యాల జిల్లా కేంద్రంలో టవర్‌సర్కిల్‌కు మంగళవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో ఓ గూడ్స్ వాహనం వచ్చి, ఆగింది. అందులో ఎలాంటి బిల్లులు లేని కిరాణా వస్తువులు(గోధుమపిండి, కోల్గేట్ తదితరాలు) ఉన్నాయి. స్థానిక డిస్ట్రిబ్యూటర్లు అక్కడికి చేరుకొని, వాహనం ఎక్కడి నుంచి వచ్చింది? ఈ సామగ్రికి సంబంధించిన బిల్లులు ఏవి అని ప్రశ్నించారు. ఆ దుకాణ యజమానితోపాటు అందులో పని చేస్తున్నవారు వారిపై చేయి చేసుకున్నారు. అడిగితే చేయి చేసుకుంటారా అంటూ బాధితులు వేరే రాష్ట్రానికి చెందిన వ్యాపారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే గతంలోనే వచ్చి, ఇక్కడ స్థిరపడిన ఓ రాజస్థాన్ వ్యాపారి ఈ వ్యాపారం చేస్తున్నట్లు తెలిసింది.

జగిత్యాల: గృహావసరాలకు అవసరమైన కిరాణా వస్తువుల(గోధుమ పిండి, కోల్గేట్, బియ్యం, పప్పు, ఉప్పు ఇతరాలు)పై జీరో దందా ఎక్కువగా చేస్తున్నారు. ప్రతినెలా రూ.కోట్లలో టర్నోవర్ జరుగుతోంది. కొందరు సంబంధిత జీఎస్టీని ఎగవేయడంతోపాటు ఈ వస్తువుల్లోనే డూప్లికేట్‌వి కలిపి అమ్ముతున్నట్లు తెలిసింది. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత తనిఖీలు సైతం పూర్తిగా నిలిచిపోయినట్లు ఆరోపణలున్నాయి. మంచిర్యాల, లక్షెట్‌పేట్, హైదరాబాద్ ప్రాంతాల నుంచి జగిత్యాలలోని హోల్‌సేల్ దుకాణాల వద్దకే వాహనాల్లో భారీగా సరుకులను తరలిస్తున్నారు.

అడ్డుకునేందుకు డిస్ట్రిబ్యూటర్ల ప్రయత్నాలు

లోకల్ డిస్ట్రిబ్యూటర్లు ఒక్కటై, సదరు వ్యాపారిపై నిఘా పెట్టినట్లు తెలిసింది. ఈ క్రమంలో మంగళవారం అతన్ని పట్టుకోవడం, గొడవ జరిగిపోయాయి. స్థానికంగా జీరో దందాకు అడ్డుకట్ట వేయాలని డిస్ట్రిబ్యూటర్లు చూస్తున్నారు. అసలు చెక్‌పోస్టులను దాటి వస్తువులు జిల్లాకు ఎలా చేరుతున్నాయన్న అంశంపై ఆరా తీస్తున్నారు. లోకల్ డిస్ట్రిబ్యూటర్లు జీఎస్టీ చెల్లించడం, అన్ని రకాల బిల్లులు వేయడంతో సరుకులు ఎక్కువ రేటు ఉంటాయి. కానీ ఇతర రాష్ట్ర వ్యాపారి షాపులో తక్కువ రేటుకు వస్తువులు దొరకడం, అతను హోల్‌సేల్‌గా ఇతర గ్రామాలకు, పట్టణాలకు అమ్మడంతోపాటు జిల్లా కేంద్రంలో రిటైల్‌గా విక్రయించడంపై డిస్ట్రిబ్యూటర్లు ఆందోళన చెందుతున్నారు.

ఇతర రాష్ట్రాల్లో పరిచయాలే ఆసరాగా..



జగిత్యాల జిల్లా కేంద్రంలో లోకల్ డిస్ట్రిబ్యూటర్లతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు అనేక మంది ఉన్నారు. ఈ వ్యాపారులు ఇతర రాష్ట్రాల్లో పరిచయాలను ఆసరాగా చేసుకొని, ఇక్కడికి అన్ని వస్తువులను తెప్పించుకుంటూ జీరో దందాకు తెరలేపుతున్నారు. ఈ విషయంలో జీఎస్టీ అధికారులు సైతం పెద్దగా పట్టించుకోకపోవడంతో వారు ఆడిందే ఆటగా మారింది.

జీరో మాలా.. డూప్లికేటా?

జగిత్యాలకు రాత్రిపూట వ్యాన్లలో తీసుకువచ్చే సరుకులకు బిల్లులు లేకపోవడంతోపాటు ఎక్కడి నుంచి వస్తున్నాయో తెలియడం లేదు. కొందరు జీఎస్టీ ఎగవేత కోసమే ఈ తతంగం నడిపిస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా డూప్లికేట్ వస్తువులను సైతం ఇందులో తెప్పిస్తున్నట్లు తెలిసింది. ముఖ్యంగా చాయిపత్తి ప్యాకెట్లు, పేస్ట్‌లు, గోధుమ పిండి, మైదా పిండి ఇలా అనేక రకాలవి తెప్పిస్తున్నారు. వారం రోజుల క్రితం ఓ వ్యాపారి ఓ నకిలీ చాయిపత్తి ప్యాకెట్ అమ్ముతుండగా సదరు కంపెనీవారు పట్టుకొని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతనిపై కేసు నమోదైంది. 6 నెలల క్రితం మహారాష్ట్రకు చెందిన ఓ బ్రాండ్‌కు సంబంధించిన గోధుమ పిండి ప్యాకెట్లను ఇక్కడ విక్రయించగా ఆహార భద్రత శాఖ అధికారులు పట్టుకున్నారు. ఈ విషయమై జీఎస్టీ అధికారులను వివరణ కోరగా తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని చెప్పడం కొసమెరుపు.

గూడ్స్ వాహనం పట్టివేత



పోలీస్‌స్టేషన్‌లో గూడ్స్ వాహనం

జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి గూడ్స్ వాహనంలో బిల్లులు లేని సామగ్రిని తీసుకువచ్చి, దుకాణంలో విక్రయిస్తుండగా లైసెన్స్ ఉన్న వ్యాపారులు పట్టుకున్నారు. సదరు వాహనాన్ని పోలీసులకు అప్పగించారు. బుధవారం దాన్ని వదిలిపెడుతున్నారని తెలియడంతో వ్యాపారులు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకొని, నిరసన తెలిపారు. వాహనంలో ఉన్న వస్తువులన్నింటికీ బిల్లులు చూపిస్తేనే వదిలిపెట్టాలని, లేకుంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

- మంత్రి కొప్పుల ఈశ్వర్



మందులు పంపిణీ చేస్తున్న మంత్రి ఈశ్వర్

ధర్మపురి: దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని సాంఘిక సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. స్థానిక ఎస్‌హెచ్ గార్డెన్‌లో బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. మంత్రి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తంగా మొబైల్ వాహనం ద్వారా దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్లకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నాయని తెలిపారు. ఈసందర్భంగా 11 మొబైల్ వాహనాలను ప్రారంభించి, మారుమూల గ్రామాల్లోని వృద్ధులకు ఉచితంగా అందిస్తాయని అన్నారు. ఆస్పత్రులకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోలేని వృద్ధులను ఈ వాహనంలో తీసుకెళ్లి పరీక్షలు చేయించి, మళ్లీ ఇళ్లకు చేర్చుతాయని చెప్పారు. ఈ అవకాశమని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యశిబిరంలో 200 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ, జెడ్పీటీసీలు చిట్టిబాబు, బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, జిల్లా సంక్షేమశాఖ అధికారి నరేశ్, రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి మంచాల కృష్ణ, సభ్యుడు సిరిసిల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంజాయి నియంత్రణకు స్పెషల్ టీంలు

- డీఎస్పీ వెంకటస్వామి



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటస్వామి

రాయికల్: గంజాయి నియంత్రణకు జగిత్యాల డివిజన్‌లో స్పెషల్ టీంలు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ వెంకటస్వామి తెలిపారు. బుధవారం రాయికల్ ఠాణాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి నియంత్రణ కోసం ప్రత్యేక టీంలతో నిఘా పెడుతున్నట్లు తెలిపారు. గంజాయి తీసుకున్నా, విక్రయించినా పీడీయాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నామని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ ఆరిఫ్ అలీఖాన్, ఎస్సై అజయ్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వల్లే ఆస్పత్రి భూమి అన్యాక్రాంతం

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్లే రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రి భూమి అన్యాక్రాంతమవుతోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం రాయికల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రికి సంబంధించిన 3.06 గుంటల భూమి విషయంలో తన చివరి శ్వాస ఉన్నంత వరకు ఉద్యమిస్తానని తెలిపారు. తప్పుడు డాక్యుమెంట్లను రద్దు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ తహసీల్దార్ నిర్లక్ష్యం వల్లే ఆక్రమణదారులు కోర్టుకు వెళ్లారని పేర్కొన్నారు. అంతకుముందు తహసీల్దార్‌ను కలిసి, ఉత్తర్వుల కాపీని అందజేశారు. కలెక్టర్, డీఎంహెచ్‌వో స్పందించి, దవాఖానా భూమిని కాపాడాలని కోరారు. లేకపోతే పార్టీలకతీతంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, నాయకులు మున్ను, బాపురపు నర్సయ్య, రవీందర్‌రావు, మహేందర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, లింగంగౌడ్, రాజేందర్ ఉన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

బుగ్గారం: అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుగ్గారం మండలంలోని చిన్నాపూర్ గ్రామంలో మంగళవారం కొడిమ్యాల రామస్వామి అనే రైతు ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబసభ్యులను బుధవారం ఆయన పరామర్శించారు. రోజంతా ధర్మపురిలోనే ఉన్న మంత్రి ఈశ్వర్‌కు బాధితులకు ధైర్యం చెప్పే సమయం లేకపోయిందని మండిపడ్డారు. రామస్వామి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాతోపాటు డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేయాలన్నారు.

అడ్వకేట్ అంతిమయాత్రలో..

సిరికొండకు చెందిన అడ్వకేట్ విజయ్‌కుమార్ బుధవారం గుండెపోటుతో మృతిచెందగా అంత్యక్రియలకు డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరయ్యారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వేముల సుభాశ్, నాయకులు మదన్, గంగారాం,విజయ్, మహేశ్, నరేశ్, రవీందర్ తదితరులున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



ప్రశాంత్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: మండలంలోని రాయపట్నం గ్రామానికి చెందిన అప్పని ప్రశాంత్(25) ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ప్రశాంత్‌కు భార్య, కూతురు ఉన్నారు. 15 రోజుల క్రితం అతను తన పొలం వద్ద క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులకు సమాచారం అందడంతో జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఇంకా ఫిర్యాదు అందలేదని, ప్రశాంత్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని పోలీసులు పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆస్పత్రికి వెళ్లి, మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చారు.

పైడిపెల్లి గ్రామానికి చెందిన వ్యక్తి..

- ఈ నెల 10న ఆత్మహత్యాయత్నం

వెల్గటూర్: మండలంలోని పైడిపెల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. పైడిపెల్లికి చెందిన కొండపల్లి చంద్రయ్య(46) మద్యానికి బానిసవడంతో ఊపిరితిత్తులు చెడిపోయి, అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది, ఈ నెల 10న ఇంట్లో ఎవరూలేని సమయంలో తన భార్య మల్లీశ్వరికి ఫోన్ చేసి, తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. కూలి పనికి వెళ్లిన ఆమె హుటాహుటిన ఇంటికి వచ్చి, చూడగా ఉరితాడుకు వేలాడుతూ కనిపించాడు. మల్లీశ్వరి చుట్టుపక్కలవారి సహాయంతో అతన్ని కిందికి దించి, ధర్మారంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లింది. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి చెంది, ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్వేత బుధవారం తెలిపారు.

గుండెపోటుతో న్యాయవాది మృతి



విజయ్‌కుమార్ (ఫైల్)

జగిత్యాల జోన్: జగిత్యాల కోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్న సంద్రపు విజయ్‌కుమార్ (50) గుండెపోటుతో మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. బుగ్గారం మండలంలోని సిరికొండకు చెందిన విజయ్‌కుమార్ జగిత్యాలలోని గోవిందుపల్లిలో ఉంటున్నారు. ఆయనకు భార్య శారద ఉన్నారు. మంగళవారం విజయ్‌కుమార్ తనకు ఛాతిలో నొప్పి వస్తుందని చెప్పడంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. ఆయన మృతదేహానికి స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించగా న్యాయవాదులు, స్థానికులు హాజరయ్యారు. విజయ్‌కుమార్ మృతిపట్ల న్యాయవాదులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధ, గురువారాల్లో కోర్టు విధులకు దూరంగా ఉంటున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటిపెల్లి శ్రీపాల్ రెడ్డి తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం



శ్రీకాంత్ మృతదేహం

గొల్లపల్లి: బైక్ అదుపుతప్పి పడిపోయిన ఘటనలో గొల్లపల్లి మండలంలోని వెన్నుమట్ల గ్రామానికి చెందిన పాదం శ్రీకాంత్ (28) మృతిచెందాడు. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాంత్ పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో బ్యాటరీ షాపు నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి 10 గంటల తర్వాత షాపు వద్దకు పాత బ్యాటరీలు వచ్చాయని ఫోన్ రావడంతో సోదరుడి ద్విచక్ర వాహనంపై ధర్మారం బయలుదేరాడు. చెందోళి శివారులోని మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి, రోడ్డు పక్కన పడిపోయాడు. ఈ ఘటనలో తలకు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి శంకరవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక తరలింపు విషయంలో వివాదం

- కర్రలతో దాడి
- రైతులకు గాయాలు
- ముగ్గురిపై కేసు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని చింతకుంటలో ఇసుక తరలింపు విషయంలో వివాదం జరిగి, కర్రలతో దాడి చేయడంతో పలువురు రైతులకు గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. గ్రామంలో వంగ సతీశ్‌కు చెందిన వరి పొలంలో ఇటీవలే కురిసిన వర్షాలకు ఇసుక మేటలు వేశాయి. ఇదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా అతను వద్దని వారించాడు. అయినప్పటికీ మంగళవారం సాయంత్రం మరోసారి ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా సతీశ్ అడ్డుకున్నాడు. దీంతో వారు కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో రైతులు వంగ గంగు, వంగ సతీశ్, రెంకల చందన, రెంకల సంధ్య, రెంకల లాస్య గాయపడ్డారు. సంఘటన స్థలాన్ని ఎస్సై కిరణ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. బాధితుడు సతీశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేముల కృష్ణ, కర్ణాకర్, పుష్పలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఘటనపై గ్రామంలో రాజకీయ విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మద్యం మత్తులో నడిపిండు.. రైతును బలితీసుకుండు

- ట్రాక్టర్ కిందపడి అంబారిపేటవాసి దుర్మరణం
- పలుమార్లు పైనుంచి వెళ్లడంతో నుజ్జునుజ్జయిన మృతదేహం



పోచయ్య (ఫైల్)

వెల్గటూర్(ధర్మపురి): మద్యం తాగి వాహనాలు నడపరాదని పోలీసులు ఎంత అవగాహన కల్పించినా కొందరు వినడం లేదు. మద్యం మత్తులో ట్రాక్టర్ నడిపిన వ్యక్తి ఓ రైతును బలితీసుకున్నాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని అంబారిపేట గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. అంబారిపేటకు చెందిన ముడిమడుగుల పోచయ్య(50) తన వ్యవసాయ పొలం దున్నడానికి మంగళవారం అదే గ్రామానికి చెందిన జాడి బానయ్యను పిలిచాడు. అతను అతిగా మద్యం తాగి, ఆ మత్తులో ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్నాడు. వెనక ఉన్న పోచయ్యను గమనించకుండా వేగంగా నడపడంతో ట్రాక్టర్ అతన్ని తొక్కుకుంటూ వెళ్లింది. ఈ సంఘటనలో పోచయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయాన్ని కూడా తెలుసుకోలేని స్థితిలో ఉన్న బానయ్య పలుమార్లు ట్రాక్టర్‌ను మృతదేహం పైనుంచి తిప్పడంతో నుజ్జునుజ్జయి, తల, మొండెం, కాళ్లు, చేతులు వేటికవే పూర్తిగా తెగిపోయాయి. పొలం దున్నడం పూర్తయిన తర్వాత పోచయ్య కనిపించడం లేదని అతని కుమారుడు సతీశ్‌కు చెప్పాడు. దీంతో కుటుంబసభ్యులు గ్రామంలో వెతకగా ఆచూకీ లభించలేదు. రాత్రి సమయంలో పొలంలో వెతకగా రక్తం, పోచయ్య శరీర భాగాలు కొద్దిగా కనిపించాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు బుధవారం పొలంలో పూర్తిగా తెగిపడిన మృతుడి శరీర భాగాలను బయటకు తీయించి, పోస్టుమార్టం చేయించారు. పోచయ్య కుమారుడి ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మద్యం తాగి, ట్రాక్టర్ నడిపి, పోచయ్య మృతికి కారణమైన బానయ్యపై కఠినచర్యలు తీసుకోవాలని మృతుడి కుటుంబసభ్యులు కోరుతున్నారు.

భూమి తమదేనంటూ బెదిరింపులు

- ప్రహరీ నిర్మాణం అడ్డగింత.. యజమానిపై దాడి
- అడ్డుకున్న స్థానికులు.. తాడుతో చెట్టుకు కట్టేసి పోలీసులకు అప్పగింత
- కరీంనగర్ జిల్లా చెంజర్ల గ్రామంలో ఘటన



ముగ్గురిని తాడుతో చెట్టుకు కట్టేసిన స్థానికులు

మానకొండూర్: తమకు సంబంధం లేని భూమిలోకి చొరబడి సదరు భూమి తమదేనంటూ ముగ్గురు వ్యక్తులు సీడ్ ప్లాంటు యజమానిని బెదిరించారు. అతడిపై దాడికి దిగారు. స్థానికులు అడ్డుకుని ఆ ముగ్గురిని చెట్టుకు కట్టేశారు. అనంతరం పోలీసులకు అప్పగించగా కేసు నమోదైన ఘటన కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం చెంజర్లలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. కరీంనగర్‌కు చెందిన గురిజాల జయరామయ్య మూడేళ్లక్రితం మానకొండూర్ మండలం చెంజర్ల శివారులో సర్వే నంబర్ 156లో 1.08 ఎకరాల భూమిని కరీంనగర్‌కు చెందిన బొమ్మవరం కిషన్‌రావు వద్ద కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఆ భూమిలో సంఘమిత్ర సీడ్స్, కార్పొరేషన్ పేరిట గోదాం నిర్మించాడు. బుధవారం సీడ్ కంపెనీ చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపడుతుండగా తిమ్మాపూర్ మండలం రేణికుంటకు చెందిన రాజుగౌడ్, కరుణాకర్, దివాకర్ అక్కడికి చేరుకున్నారు. ఆ భూమి తమదేనంటూ గోడ కట్టకుండా అడ్డుకున్నారు. చంపుతామని యజమానిపై దాడిచేశారు. చొక్కా చింపేసి, చంపుతామని బెదిరించారు. అక్కడే ఉన్న కొందరు స్థానికులు ఆ ముగ్గురిని చెట్టుకు బంధించారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. సీడ్ ప్లాంటు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

యువతి అదృశ్యం

సారంగాపూర్: మండలంలోని అర్పపల్లి గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఎస్‌హెచ్‌వో వెంకటయ్య కథనం ప్రకారం.. బాధిత యువతి కరీంనగర్‌లో చదువుతోంది. ఇటీవల ఇంటికి వచ్చిన ఆమె మూడు రోజుల క్రితం కరీంనగర్ వెళ్తున్నానని చెప్పి, వెళ్లింది. ఇప్పటికీ కరీంనగర్ చేరకపోవడంతో ఆమె తల్లి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

కాంగ్రెస్ నాయకుడిపై దుండగుల దాడి

- పరిస్థితి విషమం



తీవ్రంగా గాయపడిన రజాక్

మెట్‌పల్లి: పట్టణంలోని రేగుంట రోడ్‌లో బుధవారం కాంగ్రెస్ నాయకుడు రజాక్(27)పై దుండగులు దాడి చేశారని స్థానికులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. కోరుట్ల మండలంలోని అయిలాపూర్‌కు చెందిన రజాక్ నిజామాబాద్‌లో జరిగిన బీసీ సదస్సుకు హాజరయ్యాడు. తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో పని నిమిత్తం రేగుంట వైపు వెళ్తున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు అడ్డుకొని, దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు నిజామాబాద్ తీసుకెళ్లారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసు

కథలాపూర్(వేములవాడ): స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద బుధవారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. కథలాపూర్ మండలంలోని దుంపేటకు చెందిన రాజం మద్యం తాగి, పట్టుబడ్డాడు. తర్వాత అక్కడినుంచి బైక్‌పై స్పీడ్‌గా వెళ్లిపోయాడు. కొద్దిదూరంలో పడిపోవడంతో స్వల్పంగా గాయపడ్డాడు. హెడ్‌కానిస్టేబుల్‌కు స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. కాగా రాజంపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.